పల్లెకు సంక్రాంతి కళ

ప్రతి ఇంటా మొదలైన సంబురాలు

రామాయంపేట: జూనియర్ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, లెక్చరర్ల బృందం

మెదక్ రూరల్: మెదక్ పట్టణంలో పతంగులు కోనుగోలు చేసున్న చిన్నారులు

సంక్రాంతి అంటేనే సంబురాలకు మారుపేరు. ముచ్చటగా మూడు రోజుల పండుగ. అయ్యవారికి దండంపెట్టు.. అమ్మవారికి దండం పెట్టు.. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో పల్లె తెల్లరుతున్నది. ముత్యాల ముగ్గులతో వాకిళ్లు, సకినాలు, మురుకులు, గారెల కరకరలు, అరిసెల ఘుమఘుమలు ప్రతి వీధిలో సువాసనలు వెదజల్లుతున్నాయి. పతంగులు ఎగిరేస్తూ చిన్నారులు, పెద్దలు ఆనందోత్సవాలతో గడుపుతున్నారు. కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో పల్లెలు మురుస్తున్నాయి. ప్రతి పల్లెలో సంక్రాంతి సందడి మొదలైంది. భోగభాగ్యాలు ప్రతి ఇంటా కలుగాలని భోగి మంటలు వేసుకుంటున్నారు. కొత్త బియ్యం, బెల్లంతో లక్ష్మీ దేవికి మకర సంక్రాంతి రోజు నైవేద్యం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

–న్యూస్‌నెట్‌వర్క్ మెదక్, జనవరి 12

పిండివంటలు తయారు చేస్తున్న మహిళలు

మెదక్ రూరల్: మంబోజిపల్లి గీత పాఠశాలలో సంబురాలు జరుపుకొంటున్న విద్యార్థులు

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్

నర్సాపూర్, జనవరి 12 : ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావును శుక్రవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఎన్నికైన నయీమొద్దీన్‌కు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, రాంచందర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, నేతలు నగేశ్, ఆంజనేయులుగౌడ్, దావూద్ ఉన్నారు.

'మత్తు' సరఫరాపై ఉక్కుపాదం

■ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏడీజీపీ సందీప్ సాండిల్యా

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా పోలీసులు

మెదక్ అర్బన్, జనవరి 12 : మత్తు పదార్థాల సరఫరా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏడీజీపీ సందీప్ సాండిల్యా అన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలతో మత్తు పదార్థాల నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజీపీ మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా డ్రగ్స్‌ను రూపమాపడంలో ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. యువత భవిష్యత్ దృష్ట్యా మత్తు పదార్థాల సరఫరా, ఉత్పత్తి చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపి, వాటిని యువతకు దూరం చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ మహేందర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన ఉండాలి

న్యాలమడుగులో రైతులకు చట్టాలను వివరిస్తున్న ప్యానల్ న్యాయవ్యాది

మెదక్‌రూరల్, జనవరి 12 : వ్యవసాయ చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ న్యాయవ్యాది కరణాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద సూచనల మేరకు మెదక్ మండలం న్యాలమడుగులోని రైతు వేదికలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, సామగ్రిపై తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. రైతులకు నష్టం జరిగితే జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామాశర్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిద్దగౌడ్, ఏఈవోలు రాజశేఖర్, భార్గవి, సందీప్, శేఖర్, మంజుల ఉన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

అదృశ్యమైన యువతులు

మనోహరాబాద్, జనవరి 12 : ఇద్దరు యువతులు అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన గానుగు లిఖిత ఆధార్‌కార్డు జిరాక్స్ కోసమని ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆమెతోపాటు తన ఇంట్లో అద్దెకు ఉంటున్న రోషిణి కూడా వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో లిఖిత బంధువులు లిఖిత, రోషిణీ ఆచూకీ కోసం చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువుల ఇంట్లో వెతికారు. యువతుల ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొల్చారం, జనవరి 12 : ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై మహ్మద్‌గౌస్ కథనం.. బైక్‌పై రంగంపేట నుంచి జోగిపేటకు వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా జోగిపేట నుంచి మెదక్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై మహ్మద్‌గౌస్ సందర్శించి, మృతదేహాన్ని మెదక్ జిల్లా దవాఖానకు తరలించారు.

దేవతల చెరువు నీటిని విడుదల చేయాలి

వెల్దుర్తి, జనవరి 12 : మండలకేంద్రం శివారులోని దేవతల చెరువు నీటిని విడుదల చేయాలని శుక్రవారం తహసీల్దార్ తులసీరాంకు ఆయకట్టు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆయకట్టు రైతుల సమావేశంలో రాంపురం వైపు ఉన్న 250 ఎకరాలకు తైబంది నిర్వహించామన్నారు. తైబంది ప్రకారం రాంపురం గడ్డవైపు పొలాలకు నీటిని విడుదల చేయగా, కాలువ పైభాగంలో ఉన్నవారు కాలువల్లో మోటర్లు వేసి నీటిని మళ్లిస్తుండడంతో తైబంది చేసిన పొలాలకు నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇరిగేషన్ ఏఈ కవితకు వినతిపత్రం ఇచ్చామని, అధికారులు స్పందించి తైబంది పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో రైతులు దుర్గాగౌడ్, విఠల్, శేఖర్, నారాయణ, రమేశ్, శివ్వాగౌడ్, మల్లయ్య, నర్సింహులు, విశ్వనాథం ఉన్నారు.

స్పెషల్ సమ్మరి రివిజన్-24పై సమావేశం

■ జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాల పెంపుపై రాజకీయ పార్టీల అభిప్రాయం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 12(నమస్తే తెలంగాణ): లోక సభ ఎన్నికల కసరత్తులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్ –2024పై రాజకీయ పార్టీలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ రేట్ చార్ట్‌పై రాజకీయ పార్టీల అభిప్రాయాలు తెలుపాలన్నారు. జిల్లాలో జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాల పెంపు లాంటి అంశాలపై రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయం పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఫామ్ 6, 7లను పూర్తి చేయాలన్నారు. జనవరి 22 వరకు అభ్యంతరాల క్లయిమ్స్ స్వీకరణ, ఫిబ్రవరి 2వ తేదీలోగా క్లయిమ్స్ పరిష్కారం, ఫిబ్రవరి 8న తుది జాబితా వెలువడుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మల్లేశం, ఇష్రత్‌అలీ, శ్రీనివాస్, నర్సింలు, గౌస్ ఖురేషి, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

డీడీలు కట్టినవారికి గొర్రెలు ఇప్పించాలి

★ గొర్రెలకాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు

మెదక్ జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి డీడీలు కట్టినవారికి గొర్రెలు ఇప్పించాలని లేదా నగదు బదిలీ చేయాలని కోరుతూ కలెక్టర్ రాజర్షి షాకు గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. 75శాతం సబ్సిడీపై గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మొదటి విడత విజయవంతంగా పూర్తి చేసినట్లు గుర్తుచేశారు. 2019లో రెండో విడతను మొదలుపెట్టగా కొన్ని నెలల క్రితం గొర్రెల పంపిణీకి డీడీలు కట్టామన్నారు. ఈనెల 26 వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గొర్రెల పంపిణీ కార్యక్రమ విధివిధానాలు రాకుంటే జిల్లాలోని యా దవ, కురుమ, గొర్రెలకాపరులు జిల్లా కేంద్రంలో ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినవారిలో పల్లె రాజు, బత్తుల రాజు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేస్తున్న గొల్ల కుర్మలు

ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే

రామాయంపేట, జనవరి 12 : దవాఖానలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో రూ.2.50 లక్షల ఎల్‌వోసీని శుక్రవారం అందజేశారు. రామాయంపేటకు చెందిన ఠాకూర్ సంతుసింగ్ కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఎమ్మెల్యే బాధితుడికి వైద్య చికిత్స నిమిత్తం ఎల్వోసీని అందజేశారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు

రామాయంపేట, జనవరి 12 : ప్రభుత్వం ఇస్తున్న దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, సీఈవో నర్సింహులు తెలిపారు. శుక్రవారం కోమటిపల్లికి చెందిన మహిళా రైతు పుష్పాంజలికి రైతునేస్తం కింద వ్యవసాయ రుణంపై ఎల్టీ లోన్ రూ.8 లక్షల చెక్కు అందజేశారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని, కిస్తీలను సక్రమంగా చెల్లించాలన్నారు. రైతులకు పట్టాపాసు బుక్కుపై రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు మృతి

నర్సాపూర్, జనవరి 12 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆకుల దామోదర్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి బ్రాహ్మణపల్లికి చేరుకుని దామోదర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో బీఆర్ఎస్ నేతలు సత్యాగౌడ్, వంజరి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, సుధాకర్‌రెడ్డి, నర్సింహులు, నీరుడి శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రామాయంపేట, జనవరి 12 : ప్రమాదంలో చేతిని కోల్పోయిన సందీప్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రూ. 13వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ యాదగిరి, సభ్యులు శ్రీనివాస్‌శర్మ, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్, దామోదర్‌రావు, శ్రీకాంత్‌శర్మ, సతీశ్‌రావు, హైమద్, మరియమ్మ, డేవిడ్ ఉన్నారు.

చోరీ కేసులో రిమాండ్

మెదక్ అర్బన్, జనవరి 12: బైక్ దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు మెదక్ పట్టణ సీఐ వెంకటేశం తెలిపారు. శుక్రవారం మెదక్‌లో బైక్ దొంగతనం చేస్తున్న వెల్దుర్తి గ్రామానికి చెందిన దండుగుల అశోక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. నిందితుడిపై వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో బైక్ దొంగతనం కేసు నమోదైనట్లు తెలిపారు.

కష్టపడి చదవాలి

పెద్దశంకరంపేట, జనవరి 12 : విద్యార్థులు కష్టపడి చదవాలని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేసీబాయి, ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డి, సర్పంచ్ సత్యనారాయణ ఉన్నారు.

తల్లిదండ్రుల మృతితో అనాథలుగా అమ్మాయిలు

చేగుంట, జనవరి12: మెదడులో రక్తం గడ్డకట్టి తండ్రి మృతి చెందాడు. చికిత్స పొందుతూ తల్లి మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు అమ్మాయిలు అనాథలుగా మిగిలారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి గ్రామానికి చెందిన తమ్మారెడ్డి సుప్రియ బల్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కూతుర్లు. ఇద్దరిని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చేర్పించారు. పదిహేను ఏండ్ల పెద్ద కుతూరు తమ్మారెడ్డి వినూత్న మెదక్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్నది. రెండో అమ్మాయి 12 ఏండ్ల సాత్విక సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని జ్యోతిబాపూలే సంక్షేమ పాఠశాలలో ఏడో తరగతి చదువుకుంటున్నది. బల్‌రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో దవాఖానలో పరీక్షలు చేసుకున్నాడు. పరిస్థితి విషమించడంతో 2018లో బల్‌రెడ్డి మృతి చెందాడు. తల్లీ సుప్రియ కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురైయ్యింది. స్థానిక దవాఖానలో వైద్యం చేయించుకున్నప్పట్టికీ ఆరోగ్యం కుదుటపడలేదు. చికిత్స పొందుతూ సుప్రియ మృతిచెందింది. తల్లిదండ్రులు మృతిచెందడం ఇద్దరు అమ్మాయిలు అనాథలుగా మారారు. కాంగ్రెస్ ప్రభుత్వం, దాతలు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. 9000656971 ఫోన్ నంబర్‌కు ఎవరైనా, ఏదైనా సాయం అందించి పేద ఆడపిల్లలకు చేయూతనివ్వాలని సుప్రియ సోదరుడు శేఖర్‌రెడ్డి కోరుతున్నారు.

తల్లికి తలకొరివి పట్టిన చిన్న కుతూరు స్వాతిక(ఫైల్)

అనాథలుగా మారిన తమ్మారెడ్డి వినూత్న, సాత్విక

మెదక్ మున్సిపాలిటీ: వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వివేకానందుడు స్ఫూర్తినీయుడు

■ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

■ మెదక్ జిల్లావ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతి

తూప్రాన్ పట్టణంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి

స్వామి వివేకానందుడి అడుగు జాడల్లో యువత నడవాలని ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఫుడ్స్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానందుడి జయంతిని నిర్వహించారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో వివేకానందు విగ్రహాన్ని ఆవిష్కరించారు. మండల కేంద్రాల్లో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేకానందుడి సేవలను వక్తలు కొనియాడారు. వివేకానందుడు చూపిన మార్గంలో యువత పయనించాలని సూచించారు.

- న్యూస్‌నెట్‌వర్క్ మెదక్, జనవరి 12



కొల్చారంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సై మహ్మద్ గౌస్, సంఘమిత్ర సంఘం సభ్యులు

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

■ ఎమ్మెల్యే సునీతారెడ్డి తనయుడు శశిధర్‌రెడ్డి

■ పైతర గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు

కొల్చారం : పైతరలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు రవితేజరెడ్డి

కొల్చారం/ చేగుంట, జనవరి 12 : యువతలో స్నేహసంబంధాలను పెంపొందించడానికి క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు దోహదపడుతాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తనయుడు శశిధర్‌రెడ్డి అన్నారు. కొల్చారం మండలం పైతర గ్రామంలో శుక్రవారం పైతర ప్రీమియర్ లీగ్ సీజన్–1 పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీల్లో విన్నర్‌కు రూ.20వేలు, రన్నర్‌కు రూ.10వేలతో ప్రోత్సాహక బహుమతులను బీఆర్ఎస్ నాయకుడు రవితేజరెడ్డి అందజేయనున్నారు. స్పాన్సర్స్‌గా బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆదం ఎల్లయ్య, సర్పంచ్ వెల్మకన్నె సంతోష, ఎస్సీ సెల్ నాయకుడు మరెల్లి అనిల్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళీగౌడ్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, కోనాపూర్ ఉపసర్పంచ్ సుకన్యామధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మల్లేశం, సుధాకర్,నాగరాజు, కార్తికేయ, రాజు, శివ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం : ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట మండలంలోని మక్కరాజిపేట గ్రామంలో కబడ్డీ పోటీలను ఎంపీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి విశ్వేశ్వర్, యాదవరెడ్డి, నాగరాజుగౌడ్, రాజయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట క్రీడాప్రాంగణానికి రూ.8.40 లక్షలు

★ దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

చేగుంటలోని క్రీడాప్రాంగణానికి రూ.8.40 లక్షలు మంజూరైనట్లు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చేగుంటలో క్రీడాప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. క్రీడాప్రాంగణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక యువకులు కోరారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రూ.8.40 లక్షలు మంజూరు చేశారని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ భాస్కర్, నాయకులు ముజామిల్, సతీశ్, శ్రీకాంత్, స్టాలిన్, నర్సింహులు, పుర్రె ఆగం తదితరులు ఉన్నారు.

చేగుంట : మక్కరాజిపేటలో కబడ్డీ క్రీడాకారులతో ఎంపీపీ మాసుల శ్రీనివాస్

చేగుంటలో క్రీడాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

ఇంటింటా ఇన్నోవేటర్‌లో

విగ్నేశ్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

అవార్డుకు ఎంపికైన విగ్నేశ్

పాపన్నపేట, జనవరి 12: మండలంలోని నాగ్‌సాన్‌పల్లి జడ్పీహెచ్ ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న చాకలి విగ్నేశ్ ఇంటింటా ఇన్నోవేటర్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారని ఆ పాఠశాల సైన్స్ టీచర్ అశోక్‌కుమార్ తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేకమైన చొక్కా తయారీపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విగ్నేశ్ మాట్లాడుతూ పక్షవాతం వచ్చిన వృద్ధులు లేదా యాక్సిడెంట్ అయ్యి చేతులు విరిగిన వారికి చొక్కా వేయడం, తీయడం కష్టం. ఇటీవల తమ ఇంట్లో తమ్ముడికి చెయ్యి విరిగినప్పుడు మా అమ్మ ఇబ్బంది పడేదని, అది చూసిన తాను ఇలా ప్రత్యేకమైన షర్ట్ తయారు చేశానని తెలిపారు. ఈ షర్ట్‌కు వన్‌సైడ్ పూర్తిగా అంటే చేతులకు, కింది వైపు కూడా బటన్స్ ఉంచినట్లు తెలిపారు. చేతులు పైకెత్తకుండా ఈ షర్టు వేసి బటన్స్ పెడితే సరిపోతుందన్నారు. నాగ్‌సాన్‌పల్లి గ్రామస్తులు, హెచ్ఎం రాంకిషన్, ఉపాధ్యాయులు విగ్నేశ్‌ను అభినందించారు.

కట్టను తొలిగించినవారిని శిక్షించాలి

చేగుంట, జనవరి 12 : కుంట కట్టను కొందరు రియల్ వ్యాపారులు తొలిగించి దారిని తీశారని, వారిపై చర్యలు తీసుకోవాలని నార్సింగి మండలానికి చెందిన రైతులు కోరారు. నార్సింగికి చెందిన రైతులు లక్ష్మి, మోతుకు నారాయణ మాట్లాడుతూ.. జాతీయ రహదారి సమీపంలోని సర్వేనంబర్ 294లో తిడువాయి కుంట కట్టను కామారెడ్డికి చెందిన రియల్ వ్యాపారులు తొలిగించి, వారి భూముల మీదుగా రోడ్డు ఏర్పాటు చేస్తున్నారన్నారు. వెంటనే కుంటను సరిచేయాలని కోరుతున్నారు. ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్ వివరణ ఇస్తూ.. కుంట కట్టను తొలిగించిన వ్యక్తులపై కేసులు నమోదు చేయిస్తామని, విచారణ చేసి నివేదిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

చేగుంట, జనవరి 12 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన చేగుంట 44జాతీయ రహదారపై శుక్రవారం రాత్రి జరిగింది. బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నారు. శుక్రవారం 44వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న సమయంలో కామారెడ్డి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడక్కడే మృతి చెందారు. మృతుల్లో ఒక్కరు షావాజ్ (28)గా గుర్తుంచారు. మరో యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.